


(గత సంచిక తరువాయి)

## సప్తర్షి వనం

### 7) జమదగ్ని

సప్తఋషుల్లో ఆఖరి ఋషి జమదగ్ని. ఈయన ప్రజాపతి భృగుమహర్షి కుమారుడు. ఈ మహర్షికి వేదాలు, ఆయుధవిద్యల్లో సహజసిద్ధ నైపుణ్యం వుండటం విశేషం. ఈయన భార్య పతివ్రత అయిన రేణుకాదేవి. వీరికి ఐదుగురు కుమారులు. వారిలో ఐదవవాడు పరశురాముడు. ఇతడు విష్ణుమూర్తి అవతారం. దశావతారాల్లో ఆరవ వాడు.





* జమదగ్ని అగ్నితత్త్వం కలిగినవాడు. (జమాత్ అంటే ఒక రకమైన అగ్ని)
* రేణుకాదేవి – రేణువు అంటే ఇసుక లేక మట్టి రేణువులు. ఈమె భూమితో అన్యోన్యతకు ఆధ్యాత్మిక సాధన చేసి వుంది.
* పరశురాముడు – వేదపాండిత్యంతో పాటు విలువిద్య యుద్ధ విద్యల్లో ఆరితేరిన మహాయోధుడు. భూమిపై చిరస్థాయిగా నిలిచే చిరంజీవుల్లో ఒకడు. బ్రాహ్మణత్వం, క్షత్రియత్వం కలబోసిన వ్యక్తిత్వం కలిగినవాడు.
* పరశురాముడు ద్రోణాచార్యుడు, కర్ణులకు గురువు. రాబోయే కల్కి అవతారానికి కూడా ఇతడే గురువని పురాణప్రశస్తి.

### రేణుకా ఎల్లమ్మ

శ్రీ రేణుకాదేవి ప్రతినిత్యం వారి ఆశ్రమం దగ్గరలోని నది నుంచి నీళ్ళు తెచ్చేది. అయితే ఆమె ఆ నది ఒడ్డులో ఉన్న మట్టితో కుండను చేసి, ఆమె పాతివ్రత్య మాహాత్మ్యంతో పచ్చికుండలో నీటిని నింపి పూజాది క్రతువులకు వాడే నిమిత్తం తెచ్చేది. ఇలా ఉండగా ఒకరోజు ఆమె ఆకాశమార్గంలో వెళుతున్న గంధర్వులు, వారి భార్యలను చూసి క్షణకాలంపాటు విలాసవంతమైన జీవితం పట్ల మోహితురాలైంది. వెను వెంటనే ఆమె తిరిగి మామూలు స్థితికి చేరు కున్నా, పాతివ్రత్య భంగం వల్ల ఆ రోజు కుండలో నీటిని నిలుపలేకపోయింది.



ఆమె వట్టి చేతులతో ఆశ్రమానికి రాగా, విషయాన్ని దివ్యదృష్టి ద్వారా తెలుసుకున్న జమదగ్ని కోపావేశంతో తన కొడుకులను పిలిచి, ఆమె శిరస్సును ఖండించమని ఆదేశించాడు. అందుకు నిరాకరించిన నలుగురు కుమారులను భస్మంగా మార్చేయగా ఐదవ కొడుకైన పరశురాముడు తండ్రి ఆజ్ఞను శిరసావహించాడు. ఆ చర్యకు మెచ్చిన జమదగ్ని వరం కోరుకోమనగా, అతడు సమయస్ఫూర్తిగా తన తల్లినీ, సోదరులనూ పునరుజ్జీవితులను చేయమని వేడుకున్నాడు. జమదగ్ని వారిని తిరిగి మామూలు స్థితికి తీసుకొని వస్తాడు.

దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో, ఉత్తరభారతదేశంలోని హిమాచల్ ప్రదేశ్‌లో శ్రీ రేణుకాదేవిని వివిధ నామాలతో విరివిగా ఆరాధించటం చూడవచ్చు.

అత్యున్నత స్థానంలో ఉన్న సప్తఋషుల్లోని జమదగ్ని భార్య ఊరూరా వెలసి అందరి పూజలను అందుకొని, వారిని తగురీతిన అనుగ్రహించడం విశేషం.

ఎల్లమ్మ చరిత్రను చూస్తే వివిధ ప్రాంతాల్లో రకరకాల కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటిలోని వాస్తవికతను కాక, వాటి వెనుక వున్న రేణుకాదేవి మూలకథను, ప్రజల భక్తి విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలను గమనించటం, దీనిని మీకందించటంలోని ముఖ్య



చేదు గతాన్ని తవ్వుకునేకన్నా, తీపి భవిష్యత్తుకు ప్రణాళిక వేసుకోవడం మేలు.

ఉద్దేశ్యం.

* పరశురాముడు రేణుకాదేవి శిరస్సుని ఖండించిన వెంటనే ఆమె ఆత్మ అనేకమై నలుదిక్కులా వ్యాపించి తిరిగి జమదగ్ని వరం వల్ల జీవితురాలౌతుంది. ఈ అనేకమైన ఆత్మ భారతావనిలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవార్లుగా అవతరించినట్లు శ్రీ దేవీ భాగవతంలో వివరించబడింది.
* హైదరాబాద్ మహానగరంలోనే 116 గుళ్ళు ఉన్నాయి. స్థల పురాణాలు వేరైనా మరుగున పడిపోయిన మూలకథ ఇదొక్కటే.
* కొన్ని ప్రాంతాల్లో ఈరోజుకీ జమదగ్ని, రేణుకాదేవి-పరశురాముల కథ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.
* తమిళనాడులోని వెల్లూర్ ప్రాంతంలో, రేణుకాదేవి దగ్గరలోని ఒక పల్లెకి వెళ్ళినట్లు, పరశురాముడు వెదుక్కుంటూ వచ్చి ఆమెను సంహరించే క్రమంలో ఆ ఊరిలోని ఎల్లమ్మ అనే పుణ్యవతి అడ్డు పడటం వల్ల ఇద్దరూ ప్రాణాలను కోల్పోయారని ఉన్నది. జమదగ్ని వరంచేత తిరిగి ప్రాణాలను రప్పించే ప్రయత్నంలో ఒకరి తల ఒకరికి మారినట్లు అక్కడవారి నమ్మకం. జమదగ్ని రేణుకాదేవి శరీరం ఉన్న స్త్రీని స్వీకరించినట్లు, పల్లెవాసులు రేణుకాదేవి ముఖమున్న ఎల్లమ్మను దేవతగా గుర్తెరిగి ఆదరించడం మొదలైందని జానపద కథ.
* అందుచేత ప్రతి ఏటా అమ్మవారి ముఖాన్ని తయారుచేసి, ఊరేగింపుగా తీసుకువెళ్లి గుళ్లో తయారుచేసిన అమ్మవారి శరీరానికి జతపరచి పూజలు చేసి, మొక్కులు తీర్చి ఆఖరిరోజున నిమజ్జనం చేయటం అక్కడివారికి ఆనవాయితీగా వస్తోంది.







కథలు వేరైనా, ఈ రాష్ట్రాల్లోని అన్ని ఆలయాల్లో ఏడాది కొక మారు జాతరలు నిర్వహించడం, బోనాలు (నైవేద్యాలు) సమర్పించటం, అమ్మవారు పూనడం వంటివి ప్రతిచోటా చూడవచ్చు.

ఈ ఆలయాన్నింటిలో వేప చెట్లు, రావిచెట్లు విరివిగా కనిపిస్తాయి.

* తాంత్రికులు ఆరాధించే చిన్నమస్తాదేవి కూడా రేణుకాదేవి మరో రూపమే అని తంత్ర విద్యా గ్రంథాల్లో ప్రస్తావించబడింది.

ఈవిడ కాళికాదేవి యొక్క అవతారంగా భావిస్తారు. వివిధ ప్రాంతాల్లోని పేర్లని చూస్తే మహంకాళి, జోగమ్మ, సోమాలమ్మ, గుండమ్మ, మైసమ్మ, పోచమ్మ, జగదాంబిక, హోలియమ్మ, రేణుకామాత, ఎల్లమ్మ, మారియమ్మ, ఎల్లై అమ్మన్ మొదలైనవారంతా శ్రీ రేణుకాదేవి రూపాలే.

వివిధ రాష్ట్రాల్లో రేణుకా ఎల్లమ్మకు అతి పురాతనం, బహుళ ప్రాశస్త్యం గల దేవాలయాలు కూడా ఉన్నాయి. రాజులకాలం నాటి దేవాలయాల్లో ఈరోజుకీ ప్రతి ఏడాది జాతరలు విశేషంగా జరుగుతుంటాయి.



కర్నాటకలోని బాదామీలో గల శ్రీ ఎల్లమ్మ దేవాలయం



శ్రీ రేణుకా పరమేశ్వరీదేవి, చెన్నై



కర్ణాటకలోని సౌన్దతి – రేణుకాసాగర (మాల ప్రభానది)



హిమాచల్‌ప్రదేశ్‌లోని రేణుకా సదస్సు

ఎల్లమ్మ అంటే 'అంతటా ఉండే తల్లి' అని ఒక అర్థం. ఎల్లల్లో అంటే పొలిమేరల్లో ఉండే తల్లి అని కూడా అర్థం వస్తుంది. ఈ గ్రామ దేవతలు ఊరినంతటినీ దుష్టశక్తులు, అంటువ్యాధులబారి నుండి కాపాడతాయని భక్తుల విశ్వాసం. ఈవిడ సామాన్య ప్రజానీకానికి అతి చేరువలో ఉండి, అడుగడుగునా వారిని ఆదుకుంటూ వారి పూజలను అందుకుంటోంది.



ప్రతివాళ్ళు తమ పనిని తాము నీతిగా, బాధ్యతగా చేస్తేచాలు, ప్రపంచంలో అక్రమాలే జరగవు.

## జమదగ్ని – గరిక, సిరిమల్లెపువ్వు

శ్రీ జమదగ్ని మునికి సూచించబడ్డ మొక్క 'గరిక', 'సిరిమల్లె పువ్వులు'. గరిక గురించి మనం ఇదివరలో అనేకసార్లు వివరంగా తెలుసుకున్నాం. ప్రత్యేకించి నవగ్రహవనం గురించి చర్చించుకున్న సందర్భంలో వినాయకునికి గరిక అంటే గల అమితమైన ఇష్టానికి కారణాలు, చెడు స్వప్నాలు వచ్చినప్పుడు చదువుకోవలసిన శ్లోకం మొదలైన విలువైన విషయాలు తెలుసుకున్నాం.

శాస్త్రీయ నామం : Cynodon dactylon.
సంస్కృత నామం : దూర్వా, శతమూల
ప్రాంతీయ నామం : గరిక గడ్డి
ఆంగ్ల నామం : Bermuda grass, Doob grass.




గరిక గడ్డి

### ఔషధ గుణాలు

* గరిక శ్వాస, చర్మ, ఉదర సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది.
* ముక్కు నుంచి జరిగే రక్తస్రావాన్ని అరికడుతుంది.
* మొలల బాధకు ఉపశమనం కలిగిస్తుంది.
* నరాల బలహీనతలు, కాలేయం, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులను నయం చేస్తుంది.

ఇవేకాక గరికలో ఇంకా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో గరిక పచ్చడిని కూడా తినే ఆచారం ఉంది.




సిరిమల్లె – ఈ పేరుని మనం ఎంతో విరివిగా వింటుంటాము. మొక్కని చూసినవారు చాలా అరుదు కానీ దీనిని గుర్తించటం చాలా సులభం. ఇది అడవుల్లో, మైదానాల్లో, సముద్రపు ఒడ్డున పెరుగుతూంటుంది.



దీనికి సువాసన కలిగిన స్వచ్ఛమైన తెల్లటి పువ్వులతో పాటు కాయలు కూడా కాస్తాయి. దీని ఆకులు వేర్లలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి.

శాస్త్రీయ నామం : Jasminum angustifolium
సంస్కృత నామం : అస్ఫోత, మాలతి, కానన మల్లి, వన మల్లిక, సుపూజ
ప్రాంతీయ నామం : సిరిమల్లె, అడవి మల్లె
ఆంగ్ల నామం : Wild Jasmine

### ఔషధ గుణాలు

* ఇది గాయాలు, పుండ్లను మాన్పుతుంది.
* పేగుల్లోని అల్సర్లను కూడా నయం చేస్తుంది.
* చర్మవ్యాధులు, 'రింగ్ వార్మ్', తామర, క్షయవ్యాధులను సమర్థవంతంగా తగ్గిస్తుంది.
* క్యాన్సర్‌ని ఎంతో తేలికగా తగ్గించే గుణం గల వీటిమీద అధ్యయనం జరుగుతోంది.

ఇంత సులువుగా సప్తఋషుల చైతన్యం మన చేరువలో ఉండగా, వాటిని సద్వినియోగ పరచుకోవటం మన చేతిలోని పనే. పల్లెల్లో, మైదానాల్లో విరివిగా సులభంగా దొరికే ఈ మొక్కలను సేకరించి అనువైన చోటులో నాటటం మన కనీస ధర్మం.

*ఓం శ్రీ జమదగ్నయే నమః దూర్వా పత్రం*
*మాలతీ పుష్పం సమర్పయామి*

## మన ముంగిట్లో మన మొక్కలు

ఒకప్పుడు ప్రతి ఇంట్లో ఈ మొక్కలు తప్పనిసరిగా దర్శనమిచ్చేవి. ఇవి ఏ పందిరి మీదో, డాబా పైకో లేదా ముఖద్వారం పైన అల్లుకొని సాయంత్రం అవ్వగానే చక్కటి సువాసనలు వెదజల్లుతూ, అలసిపోయి ఇంటికి వచ్చే వారిని సేదతీర్చేవి. ఎండాకాలం వస్తే ఆరుబయట పక్కలు పరుచుకొని విశాలమైన ఆకాశంలోని నక్షత్రాలని చూస్తుంటే, అప్పుడప్పుడూ వీచే చల్లని గాలిలో ఈ మల్లె, సన్నజాజి, విరజాజి, చమేలీ, గిన్ని మాలతీ, రాధామనోహరం, మొల్ల మొదలగు పువ్వుల సువాసనలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొని వుండేది.

ప్రస్తుతం ఈరోజులకి తగ్గట్టుగా ఈ మొక్కల్లోనే కుండీల్లో ఇమిడే హైబ్రిడ్ రకాలు వస్తున్నాయి. ఎండ తగిలే అవకాశం ఉండి, కాస్త

మల్లె



చమేలీ





కాలాన్ని అర్థం చేసుకోగలిగిన వ్యక్తి జీవితాన్ని అపార్థం చేసుకోలేడు.



సన్నజాజి



విరజాజి



గిన్ని మాలతి



రాధా మనోహరం

చోటు ఉన్నవారు మన ఈ మొక్కలని ఆదరిస్తే, మన రాబోయే తరాలవారికి కనీసం మొక్కల పేర్లు సువాసనలు పరిచయం చేసినవారమౌతాము. టివీల్లోనూ, కంప్యూటర్ల లోనూ మొక్కలు, పువ్వుల బొమ్మలు చూపెట్టగలమేమో గానీ, అసలైన సువాసనని చూపించలేము కదా. కాబట్టి మనకు ఉన్న కాస్త చోటులోనే ఈ మొక్కలని పెంచుదాం. మన తరతరాల సిరులని కలకాలముండేలా కాపాడుకుందాం!